

భార్య:-నిన్నరాత్రి తప్పత్రాగిన సంగతి నేనెరుగుదును. మీరు లాంతరు స్థంబాన్ని కౌగలించుకోవడమే చాలు నిదర్శనం.

భర్త (ఇంకా మత్తులోనే):-లాంతరు స్థంబాన్ని కౌగలించుకొన్నా నీకు యీర్ష్యయేనా?

# మేనరికం

శ్రీ: మేడిశెట్టి వెంకటరత్నం

మన సంఘాన్ని పట్టుకొని వూపిరితీసేస్తూన్న దయ్యాల్లో మేనరికదయ్యం ఒకటి. పిల్లవాడు ఎలావున్నా డనీ, చిల్లిగవ్వకు గతిలేని పెద్దమ్మ గానీ, దమ్మిడీ సంపాదించుకోను శక్తిలేని వాజమ్మ గానీ, కురూపిగానీ, ఆఖరుకు నపుంసకుడుగానీ; తన మేనమామకూతురు విద్యలోనేమి, సంపదలోనేమి, సౌందర్యములోనేమి, గుణములోనేమి, ఎన్నోరెట్లు తనకంటే అధికంగావుండి ఆమె పాదములు కడుగుటకుకూడ అర్హత లేకపోయినా పెండ్లియాడను మాత్రమున్నది హక్కు. సనాతన ఛాందసులు, పూర్వాచారపరాయణులు ఈహక్కును కాపాడేటందుకు తమ ప్రాణములుకూడ అర్పిస్తారు. యిలాంటివాండ్లను తమబుద్ధి మార్చుకోమనడం చర్చిల్ గారిని యిండియాకు పూర్ణస్వాతంత్ర్య మిమ్మనడం ముసులోనీగారిని అబిసీనియాతో యుద్ధం మానుకోమనడంకన్నా అవివేకం. యిలాంటివారు త్వరగా చెల్లిపోతేనేగాని, సంఘం ఏమాత్రం బాగుపడదు.

౧

ఇందిర 12 సంవత్సరముల బాలిక. అతి సుగుణవంతురాలు. గులాబి పువ్వులాంటి చెక్కిళ్లు, పెద్ద కళ్లు, మృదువైన శరీరంగలిగి ఎక్కడలేని తేజస్సుతో మెఱుస్తుంది. గాంధీనగరం జాతీయ పాఠశాల్లో చదువుతుంది. సంగీతంలో ఆరితేఱింది. యిందిర హిందీ జాతీయ గీతంతో మొదలుపెట్టాలి ఏ మీటింగుగానీ ఆనగరంలో. చూచిన వాండ్లంతా ఆమెను చాలా మెచ్చుకొనేవాండ్లు. గాంధీగారుచితంగా యిచ్చారామెకు తన ఆటోగ్రాఫ్"

౨

"రామారావు చాలమంచివాడు. మొన్ననే నాతో B, A. ప్యాసయ్యాడు. ఆస్తిలేకపోయినా ఏదో నెలకు 50 రూపాయలు సంపాదించుకొని గౌరవంగా జీవించగల శక్తిగలవాడు. మన యిందిర నతనికిచ్చి వివాహం చేయాలని నాకు చాలరోజుల్నించి వుంది ఆశ.

"అమ్మ బాబో కుటుంబరావుండగనే"

"ఆ! యిందిరను వాడికివ్వడమే యిందిరెక్కడ, చదువులేక ఎప్పుడూ రోగాల్తోఏడుస్తూండే ఆవెధవెక్కడ.

"మీ మేనత్తకొడుకోయ్, యియ్యకతప్పదు"

"యిందిర వద్దంటే"

"కావలి" అనిపించేది"

"నీవుకాదు పెండ్లిచేసుకోడం. యిందిర. ప్రతిమానవునికి సుఖానికి హక్కువుంది. కనుక ఆమెను తన యిష్టం వచ్చిన యువకుని కోరుకొని పెండ్లిచేసుకొని యావజ్జీవం సుఖంగా కాలం గడపనిమ్మ"

"పిల్లకాయల్ని చదివించడమే తప్పు"

"యిందిర ఆచవటను పెండ్లి చేసుకోకూడదు"

"చేసుకొని తీరాలి"

"అలా అయితే మీతో నాకేమీ సంబంధంలేదిక నేను వెళ్లుతాను"

"నిరభ్యంతరంగా"

"మనవాడు చెప్పినట్లు ఆరామారావు కిచ్చినట్లైతే ఎంతో సుఖమనుభవిస్తుండేది మన యిందిర యిప్పటికి. వాడిమాటవినక వాణ్ణివెళ్లగొట్టి, మేనరికమని ఆవాజమ్మకిచ్చి పెండ్లిజేసి రజస్వలకూడ కాని, నా పన్నెండేండ్ల చిన్ని బిడ్డను అప్పుడే విధవనుజేసి మూల కూర్చోపెట్టినారు"

"మనమేంచేస్తామే అది దానిఖర్మం చేసుకొన్న ఖర్మ అనుభవించకతీరదు. యిందిర బాలవితంతువుకావాలి అని వ్రాసివుండింది దాని నొసట. అయింది. దానికి విచారమెందుకే. ఆరామారావునే పెండ్లిచేసుకొనివుంటే వాడికికూడ అదేగతి పట్టేది."

యిందిర అదృశ్యమయింది. బావులన్నీ వెతికారు. గుంటలన్నీ చూచారు. ప్రక్క పల్లెలంతా దర్యాప్తు చేశారు. ప్రయోజనం లేకపోయింది. నరుసు పంతులు తల ఎత్తలేకపోయాడు. వూరిలో గుసగుసలు మొదలిడినయి. అప్రతిష్ఠ. కోపం వచ్చింది. ఏంచేయగలడు పాపం. కాని, ఆరాత్రి తన కొమారుడొచ్చి రహస్యంగా వెళ్లినాడని తెలియగనే కొంచం ధైర్యం వచ్చింది.

నరుసు పంతులుకి తంతినుండి "యిందిర పునర్వివాహంచేసుకొంది" రక్తం చల్లబడ్డది. తోక త్రొక్కిన త్రాచుపామయ్యాడు. నోరు నొప్పిపుట్టినంతరకూ తిట్టాడు యిష్టంవచ్చినట్లు వంశనాశనానికి పుట్టిన కూతుర్ని. తర్వాత వూరుకొన్నాడు.

కళావిహీనమైన సుబ్బమ్మగారి ముఖానికి తేజస్సు తెచ్చిందా తంతి. కాని, తనభర్తకు చూపలేదు.